RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 240 | పేజీలు : 08 | బుధవారం | 09-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# తాతా మధు,నవీన్ కుమార్ రెడ్డి

## సస్పెండ్

### ప్రకటించిన మండలి చైర్మన్

- శాసన మండలిలో తాతా మధు,నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలని తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన చైర్మన్
- సెషన్ మొత్తానికి సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన చైర్మన్

2



2

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.

**తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం :** అంతకుముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు



# కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

- తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది కానీ
- స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు
- తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందన్న స్పీకర్
- బీఆర్ఎస్‌లా సస్పెన్షన్ల సంస్కృతి తమది కాదని స్పష్టీకరణ
- ఈ వ్యవహారంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

2

# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

### హైకోర్టు ఉత్తర్వులపై ప్రభుత్వం పిటిషన్

ప్రభుత్వం తరపున ఏజీ వాదనలు

ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారన్న ఏజీ

ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించారని కోర్టులో వాదనలు

2

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై ప్రభుత్వం పిటిషన్



# కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది..

### కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

2

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

2



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం'

# మహిళల ముందు బట్టలు విప్పుతారా?

- మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్
- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి



2

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన,

# ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు



2

- కేసీఆర్‌ను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు: జగదీశ్ రెడ్డి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమన్న జగదీశ్ రెడ్డి
- కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నామని ఓ ఎమ్మెల్యే అన్నారని మండిపాటు
- కేసీఆర్ పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని ఆగ్రహం

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

తాము బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్న క్రమశిక్షణ కలిగిన సైనికులమని... కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత చర్యలకు, పోలీసుల అక్రమ అరెస్టులకు తాము



# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద 144 సెక్షన్ విధింపు..

- భారీగా మోహరించిన పోలీసులు
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు
- కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి పిలుపునిచ్చిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఫాంహౌస్ వైపు వెళ్లే అన్ని
- రహదారులను దిగ్బంధించిన పోలీసులు

2

# బెదిరించే హక్కు ఎవరిచ్చారు?

- స్పీకర్‌ను బెదిరించే హక్కు హరీశ్‌రావుకు ఎవరిచ్చారు? : శ్రీధర్ బాబు
- స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి మీరెవరని ప్రశ్నించిన శ్రీధర్ బాబు
- స్పీకర్ ను బెదరించేలా మాట్లాడటం సభా సంప్రదాయాలకు విరుద్ధమని వ్యాఖ్య
- స్పీకర్ పై దూషణలు వీడియో ఫుటేజీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడి

2



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

అసెంబ్లీ స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి హరీశ్‌రావు బెదిరింపు ధోరణిలో మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమాదకరమని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీని

# ఉప ఎన్నికలకు వెళదాం

### రేవంత్ రెడ్డికి కౌశిక్ రెడ్డి సవాల్

ఇద్దరం రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళదాం: రేవంత్ రెడ్డికి కౌశిక్ రెడ్డి సవాల్

ఉప ఎన్నికలో రేవంత్ డిపాజిట్ తెచ్చుకుంటే ముక్కు నేలకు రాస్తానన్న కౌశిక్ రెడ్డి

అసెంబ్లీలో రేవంత్ వాడిన భాష అసహ్యకరంగా ఉందని విమర్శ

కత్తులతో నరుకుతామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని మండిపాటు



2

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "కొడంగల్ స్థానానికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి. హుజూరాబాద్‌లో నేను కూడా రాజీనామా చేస్తా. మళ్లీ జరిగే ఉపఎన్నికలో రేవంత్ రెడ్డి డిపాజిట్ తెచ్చుకుంటే సభ సాక్షిగా ముక్కు నేలకు రాస్తా" అని ఛాలెంజ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, శాసనసభ వేదికగా

# కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ రువాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ (ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.“బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం” అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

# బెదిరించే హక్కు ఎవరిచ్చారు?

మొదటి పేజీ రువాయి

ఏ రకంగా నడపాలనే దానిపై స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి, “ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు” అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని సూటిగా నిలదీశారు. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌ను బెదిరించేలా వ్యవహరించడం సభా సంప్రదాయాలకే విరుద్ధమని స్పష్టం చేశారు. స్పీకర్‌పై జరిగిన దూషణల వ్యవహారంలో సదరు నేతలు ఏం మాట్లాడారో వీడియో ఫుటేజీల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని తేల్చిచెప్పారు.మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలను ప్రభుత్వం, స్పీకర్ పక్కన పెట్టేస్తున్నారన్న బీఆర్ఎస్ విమర్శలను శ్రీధర్ బాబు పూర్తిగా కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేల అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్‌ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అత్యున్నతమైన స్పీకర్ వ్యవస్థపై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభ నిబంధనలకు కట్టుబడి బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద 144 సెక్షన్ విధింపు..

మొదటి పేజీ రువాయి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యల తీవ్ర పర్యవసానాలు ఇప్పుడు కేసీఆర్ ఫాంహౌస్ వరకు పాకాయి. గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవెల్లి గ్రామంలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ ను ముట్టడించేందుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ పిలుపునివ్వడంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ నిరసనకారుల యత్నాలను, ఇరువర్గాల ఘర్షణలను అడ్డుకునేందుకు పోలీసులు ఎర్రవెల్లి పరిసర ప్రాంతాల్లో తక్షణమే 144 సెక్షన్ విధించారు. ఫామ్‌హౌస్ వైపు వెళ్లే అన్ని ప్రధాన రహదారులను బారికేడ్లతో దిగ్బంధించి, పోలీసు వాహనాలతో పహారా కాస్తున్నారు.మర్కుక్ పోలీస్ స్టేషన్ వద్ద కూడా భారీగా మోహరించిన పోలీసులు, ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని తరలించేందుకు డీసీఎం వ్యాన్లను కూడా సిద్ధంగా ఉంచారు. ఇదే సమయంలో ఎర్రవెల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ధర్నా శిబిరాన్ని పోలీసులు బలవంతంగా ఎత్తివేయడంతో పరిస్థితి రణరంగంగా మారింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల సవాళ్లు, పోలీసుల మోహరింపులతో ఎర్రవెల్లి పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.



# కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది..

మొదటి పేజీ రువాయి

చేసుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. “డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు” అని వ్యాఖ్యానించారు.అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు.దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

# మహిళల ముందు బట్టలు విప్పుతారా?

మొదటి పేజీ రువాయి

అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.“సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?” అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది.సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... “సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?” అని సంచలన వ్యాఖ్యలు చేశారు. “మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. “సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?” అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

# తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెండ్

మొదటి పేజీ రువాయి

విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోందని, మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది.

బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ : మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్‌?ను బీఆర్?ఎస్ సభ్యులు ఖండించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను చట్ట విరుద్ధంగా సస్పెండ్ చేశారని శాసనమండలి ఆవరణలో బైఠాయించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

తాతా మధు మాట్లాడకుండా అడ్డుకున్న మార్షల్స్ : తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్ అనంతరం ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా మార్షల్స్ అడ్డుకున్నారు. సస్పెన్షన్ వేటు పడినందున ప్రాంగణంలో మాట్లాడవద్దని అధికారులు తెలిపారు. తాతా మధును అదుపులోకి తీసుకుని వ్యానులో తరలించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు బీఆర్?ఎస్?ఎల్పీలో ఆ పార్టీ సభ్యులు సమావేశమయ్యారు.



# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

మొదటి పేజీ రువాయి

కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన ‘నమో 4 వికసిత్ భారత్’ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. “నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!” అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు.ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. “ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను” అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. “ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం” అని గుజరాతీలో ప్రజలను కోరారు.ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి.వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి ‘బుక్‌మైషో’ ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు

మొదటి పేజీ రువాయి

ఏమాత్రం భయపడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ దారుణాలను, వైఫల్యాలను ప్రజల కళ్లకు కట్టినట్లు ఎండగడుతుంటే తట్టుకోలేకనే ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ నడుస్తుండగా ప్రభుత్వ విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలను డప్పులు కొట్టుకుంటూ కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమని జగదీశ్ రెడ్డి నిలదీశారు. ‘కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నాం’ అని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగానే తీవ్ర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆయనపై పోలీసులు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్‌పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని, పోలీసులు వారిని ఆపకపోతే బీఆర్ఎస్ శ్రేణులే రంగంలోకి దిగి తగిన రీతిలో బుద్ధి చెబుతాయని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్‌ను కాపాడుకోవడం తమకు, తెలంగాణ సమాజానికి పెద్ద కష్టమేమీ కాదని తేల్చిచెప్పారు.శాసనసభకు వస్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై తాము హైకోర్టును ఆశ్రయించగా... ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా ఎవరు, ఎందుకు అడ్డుకున్నారనే వివరాలను రెండు వారాల్లో సమర్పించాలని అత్యున్నత నాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ భయంతోనే రాత్రికి రాత్రే బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేశారని ధ్వజమెత్తారు.నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజలకు తాగడానికి, సాగుకు నీళ్లు ఇవ్వలేక, పేదల భూములను గుంజుకుని అమ్ముకుంటూ కాంగ్రెస్ నేతలు సొంత జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు.

# ఉప ఎన్నికలకు వెళదాం

మొదటి పేజీ రువాయి

సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగించిన భాష, పదజాలం అసహ్యకరంగా ఉన్నాయని, తెలంగాణ సమాజమంతా ఈ అభ్యంతరకర వైఖరిని గమనిస్తోందని మండిపడ్డారు.సభలో ప్రతిపక్ష సభ్యులను గౌరవించకుండా సీఎం ఇష్టానుసారంగా మాట్లాడారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలోనే ‘కత్తులతో నరుకుతాం’ అని బహిరంగంగా బెదిరింపులకు దిగారని గుర్తు చేశారు. ఇవన్నీ పక్కనబెట్టి తమపై ఎథిక్స్ కమిటీ పేరుతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు.పార్టీ ఫిరాయింపుల అంశంపై కడియం శ్రీహరి చేస్తున్న విమర్శలకు కౌశిక్ రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. “కోట్లాది రూపాయల నిధులతో పాటు బీఆర్ఎస్ పార్టీ బీ-ఫారమ్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వ్యక్తి కడియం శ్రీహరి. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా పదవులు అనుభవించినప్పుడు ఆయనకు లేని నైతిక విలువలు ఇప్పుడు గుర్తుకొస్తున్నాయా?” అని నిలదీశారు. స్వార్థ రాజకీయం కోసం తల్లిలాంటి పార్టీని వీడిన నేతలు తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

మొదటి పేజీ రువాయి

వేసింది. సోమవారం ఉత్తర్వులను సవరించాలంటూ కోరింది. తెలంగాణ ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను ఆదేశించిన హైకోర్టు, ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ డీజీపీని ఆదేశించింది. అయితే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించారని ఏజీ కోర్టుకు తెలిపారని, ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారని ఏజీ ధర్మాసనానికి విన్నవించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని ఏజీ వివరించారు.


మహిళా పోలీసులను నెట్టివేసి బూతులు తిట్టారు శాసనసభ్యుల నియమావళిని ఉల్లంఘించినందుకే పోలీసులు అడ్డుకున్నారన్న ఏజీ.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిషేధాజ్ఞలను ఉల్లంఘించారని తెలిపారు. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లను దూషించారని, విధుల్లో ఉన్న పోలీసులను ఎమ్మెల్యేలు నెట్టివేసి బూతులు తిట్టారని వాదించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తులు.. చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌పై ఉంటుందని కదా అని ప్రశ్నించారు. సభ సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని, ఆయన ఆదేశాలతోనే పోలీసులు శాసనసభ్యులను అడ్డుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు నల్ల టీషర్టులతో భయానక వాతావరణం కల్పించేలా చేశారని పేర్కొన్నారు.

మహిళా పోలీసులకు మంత్రి సీతక్క పరామర్శ

మరోవైపు సోమవారం జరిగిన ఘటనలో గాయపడిన మహిళా పోలీసులకు మంత్రి సీతక్క పరామర్శించారు. ఘటన పూర్తి వివరాలను మహిళా పోలీసులు సీతక్కకు వివరించారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యకరంగా ప్రవర్తించారని, అసభ్యకరంగా తాకిన వీడియోలను మహిళా పోలీసులు సీతక్కకు చూపించారు.

# తెలంగాణ యాసకు పట్టం గట్టిన తొలి వైతాళికుడు కాళోజీ

### తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఏ భాషా సాహిత్యాలైనా ఆ ప్రాంత జీవన స్థితిగతులను, చారిత్రక నేపథ్యాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను, ప్రజల మనోభావాలను ప్రతిబింబించే అమూల్య సాధనాలు. ఆ క్రమంలో తెలుగు నేల ప్రాశస్త్యాన్ని,తెలుగు ప్రజల జీవన వైవిధ్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన ఘనత సాహిత్యానికే దక్కుతుంది. రచనకు ప్రాణాధారం భాష అయితే.. భాషకు ప్రాణాధారం యాస. ప్రజల నిత్య వ్యవహారంలోంచి పుట్టిన పలుకు సాహిత్యంలో ప్రతిధ్వనించినప్పుడే అది ప్రజల హృదయాలను తాకుతుంది. భాష ఎంత సహజంగా,జనజీవనానికి ఎంత దగ్గరగా ఉంటే ఆ సాహిత్యం అంతగా దేదీప్యమానమవుతుంది.అలాంటి తెలంగాణ ప్రజల పలుకుకు, పల్లె భాషకు, ప్రాంతీయ యాసకు పట్టం గట్టిన తొలి వైతాళికుడు కాళోజీ నారాయణరావు. తెలంగాణ మట్టి వాసనను, మనిషి మనసు తడిని, పల్లె పలుకుబడిని తన కలానికి అద్దిన ప్రజాకవి ఆయన. “అన్యభాషలు నేర్చి,ఆంధ్రంబు రాదనుచు సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా” అంటూ తెలుగు భాషపై తనకున్న మమకారాన్ని, భాషాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని కవితా పాదాల్లో నిక్షిప్తం చేశారు. తెలుగు భాషను ధ్యాసగా.. తెలంగాణ యాసను శ్వాసగా బతికిన కవితా కిరణం కాళోజీ.భాష కోసం ఎందరో కవులు కలం పట్టారు. కానీ ప్రజల భాష కోసం, ప్రజల హక్కుల కోసం, ప్రజల ఆత్మగౌరవం కోసం తన కలాన్ని ఉద్యమ స్వరంగా మలిచిన కవి కాళోజీ. అందుకే ఆయన కేవలం కవి కాదు.. ఒక చైతన్యం.కేవలం రచయిత కాదు.. ఒక ఉద్యమ స్వరం. కేవలం ఉద్యమకారుడు కాదు.. జీవితాన్నే ఉద్యమంగా, ఉద్యమాన్నే ఊపిరిగా మలుచుకున్న నిత్యచైతన్యశీలి.

**వివక్ష ఎక్కడ కనిపించినా ప్రశ్నించిన కాళోజీ**

అన్యాయం ఎదురైన చోట గొంతెత్తాడు.అణిచివేతపై తిరుగుబాటు చేశాడు. నిరంకుశత్వాన్ని నిలదీశాడు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అండగా నిలిచి, పీడితుల పక్షాన తన కలాన్ని కత్తిలా పదును పెట్టాడు.అందుకే కాళోజీ కవిత్వం కేవలం అక్షరాల సమాహారం కాదు.. ప్రజల ఆవేదనకు అద్దం, ఆత్మగౌరవానికి ఆయుధం, సామాజిక చైతన్యానికి శంఖారావం.మాటల్లో, చేతల్లో, రాతల్లో, ఆలోచనల్లో, ఆవేదనలో, ఆహార్యంలో తెలంగాణ స్వరూప స్వభావాలను సంపూర్ణంగా దర్శింపజేసిన ప్రజాకవి ఆయన. తెలంగాణ పల్లె గడప నుంచి వినిపించే పలుకును, సామాన్యుడి నోటి మాటను, జనం జీవనంలో పుట్టిన యాసను సాహిత్య భాషగా నిలబెట్టిన ఘనత కాళోజీదే.

**“బడి పలుకుల భాష కాదు.. పలుకుబడుల భాష (యాస)”**

కావాలని ఆకాంక్షించిన కాళోజీ, భాష అనేది పుస్తకాలలో బంధించబడిన పదాల సమాహారం కాదని.. ప్రజల నోట పలికే జీవన భాష అని చాటిచెప్పారు. తెలంగాణ యాసను తక్కువగా చూడటాన్ని, అవహేళన చేయడాన్ని ఆయన సహించలేదు. యాసలోనే ఒక ప్రాంతపు జీవన సంస్కృతి, చరిత్ర, ఆత్మగౌరవం దాగి ఉంటాయని తన సాహిత్యం ద్వారా నిరూపించారు.కాళోజీకి తెలంగాణ యాస కేవలం ఒక భాషా రూపం కాదు.. అది తెలంగాణ ప్రజల జీవన స్వరం. ఆ స్వరానికి సాహిత్యంలో గౌరవాన్ని కల్పించి,పల్లె పలుకును పండితుల పీఠంపై కూర్చోబెట్టిన తొలి వైతాళికుడు ఆయన.అందుకే కాళోజీ పేరు తెలంగాణ భాషతో, తెలంగాణ యాసతో విడదీయరాని అనుబంధాన్ని సంతరించుకుంది.తెలంగాణ భాషా సంస్కృతికి ఆయన ప్రతీక..తెలంగాణ యాసకు ఆయన చిరునామా..ప్రజల పలుకుకు ఆయన ప్రతిధ్వని..ప్రజా చైతన్యానికి ఆయన నిత్య స్ఫూర్తి. ఆయన చేసిన అపారమైన భాషా సాహిత్య కృషిని తెలంగాణ ప్రభుత్వం గుర్తించి, తెలంగాణ భాష, యాస, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన వారికి కాళోజీ పేరుతో ప్రతి ఏడాది సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఇది కాళోజీకి అందిస్తున్న గౌరవం మాత్రమే కాదు.. తెలంగాణ పలుకుకు, తెలంగాణ యాసకు, తెలంగాణ మట్టి గొంతుకు దక్కుతున్న గౌరవం.

కాళోజీ శరీరంగా మన మధ్య లేకపోయినా.. ఆయన పలుకు తెలంగాణ పల్లెల్లో వినిపిస్తూనే ఉంటుంది. ఆయన కలం చూపిన బాటలో తెలంగాణ యాస నడుస్తూనే ఉంటుంది. ప్రజల పక్షాన నిలిచిన ఆయన స్వరం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.

**కాళోజీని స్మరించుకోవడం అంటే ఒక కవిని స్మరించుకోవడం కాదు..**
**తెలంగాణ పలుకును గౌరవించడం. తెలంగాణ యాసను ప్రేమించడం.**
**ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటం.**

**రచన: డాక్టర్, బామండ్ల రాజు**
**రాజపేట గురుకుల తెలుగు అధ్యాపకులు,మొబైల్: 9966669313**



## 22–ఎ విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీచేయకుండా

# బాధితులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్

**22- ఏ నిషేధిత జాబితా నుంచి భూములు, నివాస స్థలాలను తొలగించే ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయాలి**

**బీజేపీ పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట పట్టణం మరియు మండల పరిధిలో 22–ఏ నిషేధిత జాబితాలో ఉన్న నివాస స్థలాలు, ఇళ్లు మరియు వ్యవసాయ భూములను 22–ఏ జాబితా నుంచి తొలగిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, 22–ఎ విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీచేయకుండా బాధితులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు సంబంధించిన స్పష్టమైన ఆదేశాలు తమకు అందలేదని అధికారులు చెబుతున్నారని బీజేపి పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ అన్నారు.ప్రభుత్వం 22–ఏ జాబితా నుంచి భూములను తొలగిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు తమ భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ తదితర అవసరాల కోసం కార్యాలయాలకు వెళ్లినప్పుడు అధికారులు తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని చెప్పడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ ప్రకటనకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అమలుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే తొలగించాలని సమావేశం డిమాండ్ చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.అనంతరం 22–ఏ నిషేధిత జాబితా తొలగింపు ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం అమలులో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి 22–ఎ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు గుంటిపల్లి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు నరేష్, సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బెలిదే అశోక్, సీనియర్ నాయకులు లెంకల పల్లి శ్రీనివాస్, నంగునూరి బాలరాజు, వంశీ, శివ, వినోద్, అజయ్, ప్రశాంత్, విజయ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు

# అసెంబ్లీ ఎదుటా నిరసనకు సర్పంచులు,మాజీ సర్పంచులు భారీగా తరలిరావాలి

**మన హక్కుల కోసం మన గ్రామాల అభివృద్ధి కోసం మన బకాయిల సాధన కోసం ఐక్యంగా పోరాడుదాం.**

**సర్పంచ్ ల సంఘం జేఏసి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు జూకంటి అనిల్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మన రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బుధవారం అసెంబ్లీ ఎదురుగా భారీ నిరసనకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ల సంఘం జేఏసి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు జూకంటి అనిల్ మీడియాతో మాట్లాడుతూ... జిల్లా సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయలని విజ్ఞప్తి చేసారు జిల్లా సర్పంచుల సంఘం జేఏసీకి సంబంధించిన అన్ని మండలాల అధ్యక్షులు తమ మండల మాజీ సర్పంచులు, ప్రస్తుత సర్పంచులను సమన్వయం చేసి, బుధవారం నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మన హక్కుల కోసం మన గ్రామాల అభివృద్ధి కోసం మన బకాయిల సాధన కోసం ఐక్యంగా పోరాడుదాం.

**డిమాండ్లు:**

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి.

గ్రామపంచాయతీలకు రావాల్సిన ఎస్.ఎఫ్.సి నిధులను తక్షణమే విడుదల చేయాలి.

గ్రామపంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను పూర్తిగా పరిష్కరించాలి.

గ్రామపంచాయతీలకు ఆర్థిక వనరులు కల్పించి స్థానిక పాలనను బలోపేతం చేయాలి అని ఆయన కోరారు.




# నేతన్న టీవీ బిగ్గెస్ట్ 2026 అవార్డు అందుకున్న గాడిపెల్లి శ్రవణ్ కుమార్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గాడి పెల్లి శ్రవణ్ కుమార్ కి, స్వరాజ్ న్యూస్ మరియు నేతన్న టీవీ సంయుక్తంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో గల పద్మశాలి ప్రతిభావంతులను గుర్తించి వారికి చేనేత ఆణిముత్యం పేరిట అవార్డులను ప్రకటించి ప్రధానం చేశారు. ఇందులో భాగంగా రఘునాధపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గాడిపెల్లి శ్రవణ్ కుమార్ కు చేనేత ఆణిముత్యం అవార్డు అందజేశారు, తను 1999 సంవత్సరం నుండి ఐదు సంవత్సరాలు, గ్రామ సర్పంచ్ గా కొనసాగారు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ



సేవలందిస్తూ అనేక స్వచ్ఛంద కార్యక్రమలు నిర్వహించినందుకు గాను నేతన్న బిగ్గెస్ట్ 2026 అవార్డు ప్రకటించి హనుమకొండ వరంగల్ ఎస్వీఎస్ విద్యాసంస్థల ఆడిటోరియంలో జరిగిన అవార్డు ప్రస్తుత చైర్మన్, మాజీ ఎంపీ, మాజీ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కామత్తపు మురళి, మరియు ఎస్వీఎస్ విద్యాసంస్థల అధినేత తిరుమలరావు, తెలంగాణ ప్రాంత మహిళా అధ్యక్షురాలు గుంటుక రూప సదానందం, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, మరియు తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకన్న, నారాయణ చేతుల చేతుల మీదుగా అవార్డు మెమెంటో ఇచ్చి చేనేత శాలువాతో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి నాయకులు మరియు మాజి ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారపు సమ్మయ్య, మరియు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పద్మశాలి ప్రముఖులు సంఘల రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### గవర్నర్‌ను కోరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 08:
రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బీజేపీ నాయకులు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మంగళవారం గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఫీజు బకాయిల అంశంపై తమ పార్టీ ఆధ్వర్యంలో అనేక రోజులుగా జిల్లాలు, మండలాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.ఫీజు బకాయిల విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైన సూచనలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరినట్లు రాంచందర్‌రావు తెలిపారు. గవర్నర్ కూడా ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.గవర్నర్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొమ్మ జయశ్రీ, బి. శాంతికుమార్, డి. కళ్యాణ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్‌రావు, వేముల అశోక్, టి. వీరేందర్‌గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్, కార్యదర్శి పి. భరత్ ప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే తదితరులు ఉన్నారు.



# తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలి : హరీశ్‌రావు

### కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకోవాలి.

**హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 08:**
తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పిందని, కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ జోక్యం చేసుకుని రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.కేసీఆర్ నివాసంపై దాడికి ప్రయత్నించడం, ప్రతిపక్ష నాయకులు, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీలో చర్చించకుండా దృష్టి మళ్లించే రాజకీయాలకు ప్రభుత్వం పాల్పడుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతు భరోసా, పింఛన్లు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల పీఆర్సీ, డీఏ వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగిందని ఆరోపిస్తూ, వారిపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. తమపై జరిగిన దాడులపై పోలీసులకు ఫిర్యాదులు ఇచ్చినా స్వీకరించడం లేదని ఆరోపించారు.అసెంబ్లీలో ప్రతిపక్షానికి సముచిత అవకాశం ఇవ్వడం లేదని, ప్రజా సమస్యలపై చర్చకు సమయం కేటాయించాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై గవర్నర్, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.



# బాత్రూంలో వ్యక్తి మృతి.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :**
చర్ల మండలం మొగళ్ళపల్లి గ్రామానికి చెందిన చింతూరి. లక్ష్మీనారాయణ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఇంటికే పరిమితమయ్యారు. మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో బాత్రూంలోకి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు వాటర్ డ్రమ్ములో పడి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. భార్య కృష్ణవేణి ఎంతసేపటికి భర్త బాత్రూం లో నుండి బయటికి రాకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా వాటర్ డ్రమ్ములో పడి ఉన్న భర్త ను చూసి హుటా హుటీన స్థానికుల సాయంతో చర్ల ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. డాక్టర్ సాయి వర్ధన్ సంకీర్త్ లు వైద్య పరీక్షలు నిర్వహించి. లక్ష్మీనారాయణ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు భార్య ఉన్నారు.

# బసంతపురం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

## రేషన్ దుకాణం మంజూరుకై హామీ ఇచ్చిన కలెక్టర్ అనురాగ్ జయంతి

హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం బసంతపురం గ్రామాన్ని ఆకస్మికంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం సందర్శించడం జరిగింది. బసంతాపురం గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేస్తున్నటువంటి సర్వే కార్యక్రమాన్ని సందర్శించి సర్వే చేసే విధానాన్ని తెలుసుకోవడం జరిగింది. అలాగే గ్రామంలోని అంగన్వాడి సెంటర్ ని సందర్శించి అంగన్వాడి సెంటర్ విద్యార్థులతో మరియు స్కూలు విద్యార్థులతో మాట్లాడి సదుపాయాలు ఎలా ఉన్నాయని తెలుసుకొని టీచర్లను అభినందించడం జరిగింది. తర్వాత గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థకు మరియు అంగన్వాడీ భవనానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. బసంతాపురం గ్రామ ప్రజలు గ్రామంలో రేషన్ దుకాణం లేనందున పక్క గ్రామమైన కాల్వపల్లికి వెళ్లి తెచ్చుకుంటూ ఇబ్బందులు గురవుతున్నారని సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి తెలియజేయడంతో గ్రామానికి రేషన్ దుకాణం మంజూరు చేయాలని సంబంధిత అధికారితో మాట్లాడి





హామీ ఇవ్వడం జరిగింది. తదనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు సక్రమంగా జరుగుతూ ఉన్నాయని తెలుసుకున్నాను మరియు సర్వేలో భాగంగా రైతులు అధికారులకు సహకరిస్తున్న విధానం చాలా బాగుంది ఇలాంటి ఆటంకం లేకుండా సర్వే జరుగుతుందని భావిస్తున్నాను అని మరియు రాజాపేట మండలంలో చిన్న గ్రామమైన బసంతాపురం చాలా ఆదర్శంగా కనిపిస్తుంది అలాగే మీరు ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేయాలి అని సర్పంచ్ ని అభినందించడం జరిగింది. మరియు గ్రామంలోని యువకులు మెండు భాస్కర్ రెడ్డి ని మరియు మెండు ఉపేందర్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది ఈ కార్యక్రమంలో బసంతాపురం గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి, ఉపసర్పంచ్ గుల్లపల్లి రాజు గౌడ్, వార్డు మెంబర్లు మెండు ఉపేందర్ రెడ్డి, వడ్లకొండ మాధవి, గంధమల్ల కవిత, వడ్లకొండ రాములమ్మ, ములకలపల్లి రమేష్, గ్రామ పెద్దలు మెండు మధుసూదన్ రెడ్డి, మెండు మహేందర్రెడ్డి, మెండు చిన్నా నరసింహారెడ్డి, మెండు సాయికుమార్ రెడ్డి, గంధమల్ల బాలకృష్ణ గౌడ్, గుల్లపల్లి వినయ్ గౌడ్, వడ్లకొండ మహేష్ బాబు, వివో మెండు పల్లవి, తదితరులు పాల్గొన్నారు

# రైతుల కోసం కలెక్టర్‌ను కలవడానికి వెళ్తే హౌస్ అరెస్ట్ చేస్తారా?

## నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 08, నారాయణఖేడ్:** నల్లవాగు ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న రైతుల పంటలకు సాగునీరు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆరోపించారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో నీరు సక్రమంగా పారడం లేదని, దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు సోమవారం నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని పంట పొలాలను పరిశీలించినట్లు భూపాల్ రెడ్డి తెలిపారు. రైతుల సమస్యలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం వినతిపత్రం సమర్పించేందుకు బయలుదేరగా



పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని ఆయన ఆరోపించారు. రైతుల పంటలకు నీరు అందించాలని కోరడం, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను కోరడం నేరమా అని భూపాల్ రెడ్డి ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారికోసం ప్రశ్నిస్తున్న నాయకులను నిర్బంధించడం సరికాదని విమర్శించారు.

**ఎమ్మెల్యే సంజీవరెడ్డిపై విమర్శలు**

స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డికి నల్లవాగు నీటి సమస్యపై సరైన అవగాహన లేదని భూపాల్ రెడ్డి విమర్శించారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. "రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజలు ఎమ్మెల్యేను ఎన్నుకున్నారు. రైతుల తరఫున ప్రశ్నించే వారి గొంతును అణచివేయడానికి కాదు. పంటలు ఎండిపోతున్న సమయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. నల్లవాగు కాలువల్లో వెంటనే పూడికతీత పనులు చేపట్టి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని ఆయన కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# 40 ఏళ్ల చిరకాల వాంఛ నెరవేర్చిన ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

## కృతజ్ఞతగా భూలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 08, నారాయణఖేడ్:** నారాయణఖేడ్ మండలం తుర్కపల్లిలోని భూలక్ష్మి అమ్మవారి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుర్కపల్లి, పోతన్‌పల్లి, పల్లుతండా, సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ గ్రామాల ప్రజలు సుమారు 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తుర్కపల్లి--కడ్పల్ నూతన రహదారి నిర్మాణం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక చొరవతో సాకారమైందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ భూలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు గ్రామాల సర్పంచులు ప్రతాప్ రెడ్డి, శ్రీధర్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల ప్రజలు పార్టీలకు అతీతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన రహదారి అందుబాటులోకి రావడంతో కడ్పల్ గ్రామం నుంచి నారాయణఖేడ్ పట్టణానికి ప్రయాణ దూరం సుమారు 6 కిలోమీటర్లు తగ్గిందని గ్రామస్తులు తెలిపారు. రహదారి సౌకర్యంతో విద్య, వైద్యం, మార్కెట్‌తో పాటు అత్యవసర సేవలకు వెళ్లేందుకు సులభతరమైందని వారు పేర్కొన్నారు. నాలుగు గ్రామాలను నారాయణఖేడ్ పట్టణానికి మరింత చేరువ చేసిన నూతన రహదారితో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడిందని గ్రామస్తులు



ఆనందం వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం లభించడంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భూలక్ష్మి అమ్మవారు ప్రసాదించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

# తుర్కపల్లిలో కాంగ్రెస్ భారీ రాస్తారోకో

## బీఆర్ఎస్ నేతల తీరును నిరసిస్తూ ఆందోళన.. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:**
యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన, రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ శ్రేణులకు మద్దతు తెలిపారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యల విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని కోరారు. రాస్తారోకోలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డప్పులు వాయిస్తూ నినాదాలు చేశారు. దీంతో తుర్కపల్లి మండల కేంద్రంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. చిట్యాల--ఢిల్లీ జాతీయ రహదారిపై, కీసర--యాదగిరిగుట్ట రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**వెయ్యి కార్లతో ఫామ్‌హౌస్ ముట్టడికి యత్నం**

అనంతరం 'కేసీఆర్ రాజకీయ చావు డప్పు' కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి కార్లతో బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సభాపతి పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని, తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి శాసనమండలి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ ప్రజలకు, స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. శాసనసభ, శాసనమండలి వంటి ప్రజాస్వామ్య సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని బీర్ల ఐలయ్య తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి ఆయన



కుటుంబాన్ని ప్రస్తావిస్తూ చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం ఎంత దూరమైనా వెళ్తామని, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల తీరును ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.









# అర్ఎస్ఈటిఐ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలు

## శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళాలకు సర్టిఫికెట్ల పంపిణీ

## యూనియన్ అర్ఎస్ఈటిఐ సిద్దిపేట డైరెక్టర్ గేము నాయక్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, తెలంగాణ బ్యూరో :**
పోసన్‌పల్లి గ్రామంలో మహిళలకు నిర్వహించిన టైలరింగ్ శిక్షణ బ్యాచ్ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళా శిక్షణార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అర్ఎస్ఈటిఐ సిద్దిపేట డైరెక్టర్ గేము నాయక్ ముఖ్య అతిథిగా పోసాన్ పల్లె గ్రామ సర్పంచ్ నర్సింహులు హాజరై, శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ నాగరాజు, ప్రశాంత్, జేపిఓ, జావేద్, సిసి కవితతో పాటు టైలరింగ్ శిక్షణార్థులు పాల్గొన్నారు. మహిళలకు ఉపాధి నైపుణ్యాలను అందించడంలో అర్ఎస్ఈటిఐ చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు.

# అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలి: సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**



రాష్ట్ర సర్పంచ్ ల కమిటీ ఆదేశాల మేరకు బుధవారం అసెంబ్లీ ఎదురుగా భారీ నిరసన కు పిలుపునివ్వడం జరిగింది. కావున జిల్లా సర్పంచ్ లు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ పిలుపునిచ్చారు.
సర్పంచ్ ల హక్కుల కోసం మన గ్రామాల అభివృద్ధి కోసం మన బకాయిల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని గ్రామపంచాయతీలకు రావాల్సిన ఎస్.ఎఫ్.సి నిధులను తక్షణమే విడుదల చేయాలని గ్రామపంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని గ్రామపంచాయతీలకు ఆర్థిక వనరులు కల్పించి స్థానిక పాలనను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయమంటే అక్రమ అరెస్టులా..?

## బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల 420 హామీలు అమలు చేయడంలో విఫలమైనందున బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు చలో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసిన రాజపేట పోలీస్ సిబ్బంది. ఉదయం 6 గంటల నుండి ముందస్తు అరెస్టులు చేసి రాజపేట పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అక్రమ అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్లో నిరసన వ్యక్తం చేసిన బిఆర్ఎస్ నాయకులు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ... పాలన చేతకాక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశ్నించే వారిని గొంతు నొక్కడంతోపాటు అక్రమ అరెస్టులను ఆదేశించడాన్ని తీవ్రంగా ఖండించిన బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, ఈ కార్యక్రమంలో రాజపేట బిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షులు రఘునాధపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్ర గోకుల జశ్వంత్, మాజి సర్పంచులు బొంగోని ఉప్పలయ్య, చెరుకు కనకయ్య, పట్టణ అధ్యక్షులు బెడిద వీరేశం, ములుగు సోము లింగం, సలావుద్దీన్, గంధమల్ల సురేష్, గజ్జల రాజు, మార్కశివ, గొర్రెంకల సాయి, తదితరులు పాల్గొన్నారు.

# బి స్మార్ట్ పోచంపల్లి అధ్యక్షులుగా లింగా స్వామి

## నియామక పత్రం అందించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జలందర్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా,**
బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలంధర్ రెడ్డి అధ్యక్షతన పోచంపల్లి మండల కమిటీ అధ్యక్షులుగా చెరుకు లింగస్వామి సెక్రటరీగా బుగ్గ లింగస్వామి కోశాధికారిగా ఎన్.సజీవ్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బడ్జెట్ స్కూల్స్ పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని వారికి అండగా ఉండి అన్ని రకాలు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతు నాపై నమ్మకంతో మండల అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు జిల్లా కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మండలంలోని పాఠశాలల సమర్థవంతంగా నిర్వహించేందుకు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానికి నా వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.చిట్టిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నోముల బసవ రెడ్డి, జిల్లా కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణంరాజు, మల్లేశం, రావుల జంగయ్య, జానీ, వివిధ పాఠశాలల కరస్పాండెంట్ తదితరులు పాల్గొన్నారు.



# మిత్రుని కుటుంబానికి 10 వేల ఆర్థిక సాయం

## మిత్రుని మృతి యూనియన్‌కు తీరని లోటు: అధ్యక్షుడు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, చర్ల, సెప్టెంబర్ 08:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం విజయకాలనీకి చెందిన టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యుడు డబ్బుల నాగరాజు అనారోగ్యంతో మృతి చెందారు. నాగరాజు గత కొన్నేళ్లుగా టాటా మ్యాజిక్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.ఆయన మృతితో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న తోటి యూనియన్ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించారు. శ్రీ సమ్మక్క సారలమ్మ టాటా మ్యాజిక్ యూనియన్ తరఫున మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని నాగరాజు కుటుంబానికి అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు మిడియం కృష్ణ తన చేతుల మీదుగా ఈ సాయాన్ని అందించారు.ఈ సందర్భంగా మిడియం కృష్ణ మాట్లాడుతూ నాగరాజు మృతి యూనియన్‌కు తీరని లోటని అన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, యూనియన్ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు కోగిల బుచ్చన్న, అంజిబాబు, పూజారి నాగార్జున, వెంకట్, పఠాన్ ఆరిఫ్, లంగరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.






# సరళా రెడ్డి అకాల మరణం బాధాకరం

## యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కొలగాని రమేష్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, భద్రాచలం, సెప్టెంబర్ 08:**
భద్రాచలం పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, టీవీ9 రిపోర్టర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి సతీమణి సరళా రెడ్డి అకాల మరణం తీవ్రంగా బాధాకరమని సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కొలగాని రమేష్ అన్నారు.మంగళవారం విద్యుత్ యూనియన్ నాయకులతో కలిసి సరళా రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనిల్ రెడ్డిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా



రమేష్ మాట్లాడుతూ సరళా రెడ్డి మృతి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని అన్నారు. తాను నేర్చుకున్న వృత్తి నైపుణ్యాలను పలువురికి అందించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన వ్యక్తిగా ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న సరళా రెడ్డి చిన్న వయసులోనే మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు. ఆమె లేని లోటును ఎవరూ తీర్చలేరని పేర్కొన్నారు.కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ కార్యదర్శి పదిలం శ్రీనివాస్, గుడ్ల రవి, 327 యూనియన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు జి. సర్వేశ్వరరావు, టీఆర్‌వీకేఎస్ యూనియన్ భద్రాచలం డివిజన్ కార్యదర్శి బీమాపాక పెదరాజు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బానోత్ యుగంధర్, హనుమాన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

## ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి
## పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, దుమ్ముగూడెం, సెప్టెంబర్ 08:**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ ఆధ్వర్యంలో లక్ష్మీనగరం ప్రధాన కూడలిలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను



అవమానించడమేనని అన్నారు.ప్రజాస్వామ్యంపై బీఆర్ఎస్‌కు నిజమైన గౌరవం ఉంటే ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వాన్ని రద్దు చేసి, ఆయన వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, నేరం రుజువైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని దుర్గాప్రసాద్ అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుని తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున నిరసనలు, దీక్షలు చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పిలక వెంకటరమణారెడ్డి, జిల్లా కార్యదర్శి లంక శ్రీనివాసరావు, జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ కను బుద్ధి దేవ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుసిని రవికుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోటుపల్లి నటరాజస్వామి, మట్టా శివాజీ, గడ్డం బాలాజీ, కెల్లా శేఖర్, కుర్సం మారయ్య, లంక శివకుమార్, సందీప్ రెడ్డి, యంబడి అర్జున్‌రావు, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి కోర్స జంపన్నతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

## ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 08:**
ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం మాసబ్‌ట్యాంక్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జేఏసీ నాయకులు కోరారు.ఈ సందర్భంగా టీజీఓస్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని శాఖల ఉద్యోగులతో సన్నాహక సమావేశాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.టీఈజీజేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో భోజన విరామ సమయంలో నిరసనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాల (డీఏ) చెల్లింపు, పదోన్నతులు, శాఖాధిపతి కార్యాలయాల్లో 12.5 శాతం కోటా తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ హైదరాబాద్ సెంట్రల్ యూనియన్ ప్రతినిధి వెంకట్, టీఈజీజేఏసీ సభ్యుడు, ఐఅండ్‌పీఆర్ ఫోరం అధ్యక్షుడు నాగులపల్లి వెంకటేశ్వరరావు, టీజీఓస్ ఫోరం సంయుక్త కార్యదర్శి వనజ, టీఎన్‌జీఓస్, ఐఅండ్‌పీఆర్ ఫోరం అధ్యక్షుడు జితేందర్, తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు,





సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులకు నెలకు రూ.3 వేల పింఛన్

## శ్రమ్ యోగి మాన్‌ధన్ పథకంలో చేరేందుకు అవకాశం.. ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు అవసరం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, సెంట్రల్ డెస్క్:**
అసంఘటిత రంగ కార్మికులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శ్రమ్ యోగి మాన్‌ధన్ పథకంలో అర్హులైన వారు నమోదు చేసుకోవచ్చు. పథకంలో చేరేందుకు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అవసరం. పొదుపు ఖాతా లేదా జనధన్ ఖాతాను వినియోగించుకోవచ్చు.పథకంలో చేరిన అనంతరం నిర్ణయించిన నెలవారీ చందా మొత్తాన్ని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా మినహాయించే విధానం ఉంటుంది. దీంతో ప్రతి నెలా విడిగా చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉండదు. నమోదు ప్రక్రియను సంబంధిత డిజిటల్ వ్యవస్థ ద్వారా పూర్తి చేసుకునే అవకాశం ఉంది.

**ఎవరెవరు అర్హులు?**
వీధి వ్యాపారులు, రిక్షా కార్మికులు, వ్యవసాయ కూలీలు, భూమిలేని కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, చర్మకారులు, ఇటుక బట్టీ కార్మికులు, దోబీ కార్మికులు తదితర అసంఘటిత రంగ కార్మికులు పథకానికి అర్హులుగా




ఉంటారు.స్థిరమైన ఉద్యోగం లేదా పింఛన్ సౌకర్యం లేని అర్హులైన కార్మికులు పథకంలో చేరవచ్చు. నిర్ణయించిన నిబంధనల ప్రకారం నెలవారీ చందా చెల్లించిన వారికి వృద్ధాప్యంలో నెలకు రూ.3,000 పింఛన్ పొందే అవకాశం ఉంటుంది.అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వృద్ధాప్యంలో కనీస ఆదాయ భద్రత కల్పించడమే పథకం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది. అర్హులైన కార్మికులు వయసు, ఆదాయం, ఇతర నిబంధనలను పరిశీలించి పథకంలో నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

# కేటీఆర్ అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి: ముద్దం నరసింహ యాదవ్

## బీఆర్ఎస్ నేత ముద్దం నరసింహ యాదవ్‌ను ముందస్తుగా అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 08:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ నేత, ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద డప్పుల మోత కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పిలుపునివ్వడంతో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి ఎర్రవల్లి వైపు బయలుదేరారు. వారిని హకీంపేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. కేటీఆర్‌ను ఎర్రవల్లి వెళ్లకుండా హకీంపేట్ వద్ద మల్కాజ్‌గిరి పోలీసులు అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ముద్దం నరసింహ యాదవ్ తప్పుబట్టారు. "ప్రజల కోసం ప్రశ్నించే నాయకుడిని అరెస్ట్ చేస్తే ప్రశ్నలు ఆగవు. ఒక్క కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే వేలాది గొంతులు మరింత బలంగా ప్రశ్నిస్తాయి" అని ఆయన అన్నారు. అధికారం ఉందనే అహంకారంతో ప్రతిపక్ష నేతలపై పోలీసు వ్యవస్థను ప్రయోగించడం సరికాదని, ప్రజాస్వామ్యంలో విమర్శలను, ప్రశ్నలను ఎదుర్కోవాలే తప్ప



అణచివేయకూడదని ముద్దం నరసింహ యాదవ్ పేర్కొన్నారు.

# రూపాయిపై పిడుగు.. పాతాళానికి మారకపు విలువ!

**డాలర్‌తో పోలిస్తే మరింత బలహీనపడిన రూపాయి**
**ముడిచమురు ధరల పెరుగుదలతో ఒత్తిడి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, సెంట్రల్ డెస్క్:**
అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిణామాలు భారత రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ముడిచమురు ధరలు పెరగడం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 10 పైసలు తగ్గి 94.66 వద్ద నమోదైంది. అంతర్జాతీయ చమురు ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర 0.63 శాతం పెరిగి బ్యారెల్‌కు 97.61 డాలర్లకు చేరింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాపై ఏర్పడుతున్న అనిశ్చితి ధరల పెరుగుదలకు



కారణమవుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**రూపాయికి ఆర్బీఐ అండ**
ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం రూపాయిపై అధికంగా పడకుండా రిజర్వ్ బ్యాంక్ చర్యలు తీసుకుంటోంది. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో ఆర్బీఐ జోక్యం, దేశంలోకి విదేశీ నిధుల ప్రవాహం కొనసాగడం వల్ల రూపాయి పతనం కొంతమేర నియంత్రణలో ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూపాయి విలువ 94.00 నుంచి 94.75 మధ్య హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**నష్టాల్లో స్టాక్ మార్కెట్లు**
రూపాయి బలహీనత ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపైనా కనిపించింది. మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 382 పాయింట్లకు పైగా నష్టపోయి 75,750 స్థాయికి చేరగా, నిఫ్టీ సుమారు 98 పాయింట్లు తగ్గి 23,681 వద్ద నమోదైంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయాలు, భారత్-అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై పెట్టుబడిదారుల దృష్టి కొనసాగుతోంది.

# ధర్నాలు, నిరసనలతో హోరెత్తిన పటాన్‌చెరు

**కాంగ్రెస్--బీఆర్ఎస్ పోటాపోటీ ఆందోళనలు..**
**మండుటెండలో పాలిటెక్నిక్ విద్యార్థుల బైఠాయింపు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, పటాన్‌చెరు, సెప్టెంబర్ 08:**
పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ మంగళవారం ధర్నాలు, ర్యాలీలతో హోరెత్తింది. ఒకే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు వేర్వేరుగా నిరసనలు చేపట్టడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం పాలిటెక్నిక్ విద్యార్థులు మండుటెండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

**స్పీకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన**
శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాటా సుధారాణి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. గాంధీ పార్క్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన వ్యక్తం చేశారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటూ నినాదాలు చేశారు.

**మహిళా ఎమ్మెల్యేలపై వ్యవహారశైలిని నిరసిస్తూ బీఆర్ఎస్ ధర్నా**
అదే సమయంలో గూడెం మధుసూదన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఆందోళనకు దిగాయి. మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరుపై వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.



మహిళలను అవమానించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఒకే ప్రాంతంలో పోటాపోటీగా ఆందోళనలు చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మూడు వర్గాలను సముదాయిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

**మండుటెండలో విద్యార్థుల బైఠాయింపు**
మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన ఆందోళన కొనసాగింది. మండుటెండను లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్




చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేస్తూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఒకవైపు రాజకీయ పార్టీల నిరసనలు, మరోవైపు విద్యార్థుల ఆందోళనతో పటాన్‌చెరు ప్రధాన ప్రాంతాల్లో సందడి నెలకొంది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు బందోబస్తు కొనసాగించారు.



# కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో హోరెత్తిన గులాబీ నిరసన

## మాజీ మహిళా మంత్రులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, గోదావరిఖని, సెప్టెంబర్ 08:**
శాసనసభలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అవమానకరంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని మున్సిపల్ కార్పొరేషన్ చౌరస్తాలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ మహిళా ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. సీనియర్ మహిళా నాయకురాళ్లు, మాజీ మంత్రుల పట్ల శాసనసభలో వ్యవహరించిన తీరు అహంకారపూరితంగా ఉందని విమర్శించారు. మాజీ మహిళా మంత్రులకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యవాదులంతా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, వ్యాళ్ల హరీష్ రెడ్డి, మూల విజయ్ రెడ్డి, కరక పద్మజ శ్రీనివాస్, పోగుల వకుళ, సత్యవతి, మేకల సమ్మయ్య యాదవ్, మురళీధర్ రావు, తోకల రమేష్, తాళ్ల రాజయ్య, ఆముల నారాయణ, కార్పొరేటర్ నిమ్మరాజుల రవి తదితరులతో పాటు మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.







# అరెస్ట్ లు చేసుడు కాదు.. హామీలు అమలు చేయాలి

**బిఆర్ఎస్వి నాయకులు మోటె శేఖర్ కురుమ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం మల్లాపురం బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగ నాయకులు మోటె శేఖర్ కురుమ ను బుధవారం పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మోటె శేఖర్ మీడియాతో మాట్లాడారు... అరెస్ట్ లు చేసుడు కాదు.. హామీలు అమలు చేయాలి అని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పటివరకు ఏ ఒక్క శాఖకు సరైన న్యాయం చేయకుండా రేవంత్ రెడ్డి సర్కార్ నేటికీ 1000 రోజులు కావడంతో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కార్యక్రమాలు ప్రతి గ్రామ గ్రామాన మండల స్థాయిలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నా కార్యక్రమాలను అడ్డుకునేందుకే నన్ను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారని మోటే శేఖర్ కురుమ ఆవేదన వ్యక్తం చేశారు ఈ అక్రమ అరెస్టు ను తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు




# భజనలు, భక్తి గీతాలతో శాంతియుతంగా గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

**శాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి: పోలీసులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యాల్కల్, సెప్టెంబర్ 08:**
వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని జుక్కల్ సీఐ హన్మంత్, హద్నూర్ ఎస్సై సుజిత్ సూచించారు. వినాయక చవితి వేడుకల నేపథ్యంలో మంగళవారం గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపం నిర్వాహకులు తమ యూత్ సభ్యుల వివరాలను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వినాయకుడి ఆగమనం, నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బ్యాండ్‌లు, టపాసులు వినియోగించకుండా చూడాలని తెలిపారు. ఊరేగింపు సమయంలో యువత ఎలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడకుండా మండపాల నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. భజనలు, భక్తి గీతాలతో నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. సమావేశంలో పోలీసు సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.





# రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

**వెంటనే కేసు నమోదు చేయాలి.**
**రెడ్డి జాగృతి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యాల్కల్, సెప్టెంబర్ 08:**
రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ రెడ్డి జాగృతి నాయకులు హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తమ సామాజిక వర్గాన్ని అవమానించేలా ఉన్నాయని పేర్కొంటూ ఎస్సై సుజిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి జాగృతి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మల్లన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని తీన్మార్ మల్లన్న బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి సభ్యులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామికి లక్ష బిల్వార్చన

**శివనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యాల్కల్, సెప్టెంబర్ 08:** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని రాయికోడ్ మండలం రాయికోడ్ గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. న్యాల్కల్ మండలం న్యామాతాబాద్ గ్రామానికి చెందిన బిరాదర్ అన్నపూర్ణ – అప్పారావు పాటిల్ దంపతులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు చేపట్టారు. అనంతరం లక్ష బిల్వదళాలతో వీరభద్రస్వామికి బిల్వార్చన నిర్వహించగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.బిల్వార్చనలో పాల్గొన్న భక్తుల కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పర్యవేక్షించారు. ఆలయ రికార్డు అసిస్టెంట్ ఇందూర్ కృష్ణ, అర్చకులు టేకూర్ వీరుస్వామి, మఠం విజయ్‌కుమార్ స్వామి, జుట్టు బస్వరాజ్ స్వామి, బస్వరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ అవమానాన్ని సహించం

**అనుచిత వ్యాఖ్యలపై నారాయణఖేడ్‌లో అంబేద్కర్ యువజన సంఘం భగ్గుమంది**

**అమర ప్రసాద్‌పై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, నారాయణఖేడ్, సెప్టెంబర్ 08:** అంబేద్కర్‌పై అమర ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా, నిరసన నిర్వహించారు.సంఘం జిల్లా కార్యదర్శి అనుముల తుకారం మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం కోట్లాది ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అమర ప్రసాద్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గణపతి, శంకరన్న, కాశయ్య, భీమ్‌సేన తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నయా జోష్.. పాఠశాలలకు వరుసగా 3 రోజుల సెలవులు

**సెప్టెంబర్ 12 రెండో శనివారం.. 13న ఆదివారం.. 14న వినాయక చవితి సెలవు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 08, తెలంగాణ బ్యూరో :** తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులు, ఉద్యోగులకు ఈ వారాంతంలో వరుసగా మూడు రోజుల సెలవులు రానున్నాయి. సెప్టెంబర్ 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న సోమవారం వినాయక చవితి సందర్భంగా సెలవు ఉండటంతో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు మూడు రోజుల విరామం లభించనుంది.వరుస సెలవులతో విద్యార్థులు, ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణాలు, పర్యటనలు, పండుగ వేడుకలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు వినాయక చవితి వేడుకల కోసం తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

**నిమజ్జనోత్సవానికి ప్రత్యేక సెలవులు**

వినాయక చవితి అనంతరం జరిగే గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా స్థానిక పరిస్థితులను బట్టి కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక సెలవులు ప్రకటించే అవకాశం ఉంది. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతాల్లో మండపాల ఏర్పాటు, విగ్రహాల కొనుగోలు, ఇతర ఏర్పాట్లలో స్థానికులు, యువజన సంఘాల సభ్యులు నిమగ్నమయ్యారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

**పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, గోదావరిఖని, సెప్టెంబర్ 08:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు అంతర్గాం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం కిరణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాత మధు ఎమ్మెల్సీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ ప్రజలకు, శాసనసభకు క్షమాపణ చెప్పాలని కోరారు.అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులతో దురుసుగా వ్యవహరించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం కల్పించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో 11వ డివిజన్‌కు చెందిన దాసరి విజయ్‌కుమార్ బృందం, 11వ డివిజన్ కార్పొరేటర్ కారంగుల రమ్య, ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు గుడికందుల రవి పాల్గొన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




# తాతా మధు వ్యాఖ్యలపై పటాన్‌చెరులో నిరసన

**రాజ్యాంగ పదవిని అవమానిస్తే ఊరుకునేది లేదు: ఆదిత్యరెడ్డి**

**స్పీకర్‌పై వ్యాఖ్యలకు తాతా మధు క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, పటాన్‌చెరు, సెప్టెంబర్ 08:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పటాన్‌చెరులో కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. తెలంగాణ యూత్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు తాతా మధు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ఒక వ్యక్తిని అవమానించడమే కాకుండా రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించేలా ఉన్నాయని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.బాధ్యతాయుత రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు కూడా హద్దు ఉండాలని ఆదిత్యరెడ్డి



పేర్కొన్నారు.కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, పటాన్‌చెరు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యేపూరి శివానందం, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి**

**సీపీ అంబర్ కిషోర్ ఝా**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, రామగుండం, సెప్టెంబర్ 08:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలు 25న విగ్రహాల నిమజ్జనంతో ముగియనున్న నేపథ్యంలో మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లకు చెందిన హిందూ మత పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపం నిర్వాహకులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చిన ఆన్‌లైన్ నమోదు విధానంలో మండపం, విగ్రహం ఎత్తు, నిర్వాహకుల వివరాలు, శోభాయాత్ర మార్గం, నిమజ్జన వాహనాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని తెలిపారు.నమోదైన మండపాలను భౌగోళిక గుర్తింపు ద్వారా 'టీజీ-కాప్'లో పొందుపరుస్తామని, దీనివల్ల పోలీసులు మండపాల వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుంటుందని చెప్పారు. నిమజ్జన శోభాయాత్ర సాఫీగా సాగేందుకు ముందుగానే మార్గపటాన్ని సిద్ధం చేస్తామని తెలిపారు.



నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు

-మండపాల నిర్వహణకు బాధ్యత వహించే కమిటీ అధ్యక్షుడు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

-ప్రజలు, అత్యవసర వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలి.

-ప్రతి విగ్రహం వద్ద 24 గంటలు కనీసం ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండాలి. పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారు.

-మండపాల పేరుతో లక్కీ డ్రాలు, జూదం నిర్వహించకూడదు. ఎవరినీ బలవంతంగా చందాలు అడగరాదు.

-మండపాల వద్దకు మద్యం సేవించి వచ్చే వారిని నియంత్రించడంతో పాటు ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వరాదు.

- విద్యుత్ శాఖ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. నాణ్యమైన విద్యుత్ పరికరాలు వినియోగిస్తూ అగ్ని ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

-డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదు. ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు, ప్రసారాలకు దూరంగా ఉండాలి.

-సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, అసత్య ప్రచారాలను నమ్మకుండా సమాచారాన్ని పోలీసుల ద్వారా నిర్ధారించుకోవాలి.

-అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-112 లేదా



స్థానిక పోలీసులను సంప్రదించాలి.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ మత ఘర్షణలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతర నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు.గణేష్ విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పోలీసులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, శోభాయాత్రలో పోలీస్ శాఖ రూపొందించిన మార్గపటాన్ని అనుసరించాలని కోరారు. ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీ సభ్యులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు."పండుగలో ఆనందం వెల్లివిరియాలి.. విషాదానికి తావుండకూడదు. అందరం సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించుకుందాం" అని సీపీ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు.సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏసీపీలు ఏ.వెంకటేశ్వర్లు, టీ.ప్రవీణ్ కుమార్, రామగుండం సీఐ కృష్ణకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలకు కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకుల నిరసన

**జేబీఎస్ చౌరస్తాలో ధర్నా.. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, పికెట్, సెప్టెంబర్ 08:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జేబీఎస్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ స్థాయిలో ఉన్న వ్యక్తి అనుచిత భాషను ఉపయోగించడం బాధ్యతారాహిత్యమని విమర్శిస్తూ తాతా మధుపై శాసన మండలి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకత్వం కూడా ఈ వ్యవహారంపై స్పందించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.స్పీకర్



గడ్డం ప్రసాద్‌కు సంఘీభావం ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు.. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని శాసన మండలి ఛైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని డిమాండ్ చేశారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కవిత ఆగ్రహం

**రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కోవాలి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 08:**
కేసీఆర్‌పై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా స్పందించారు. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప వారి చావును కోరుకోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యర్థి నాయకులు, కులాలు, వ్యవస్థలను దూషించడం ఇదే మొదటిసారి కాదని కవిత పేర్కొన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేస్తున్న నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా అని నిలదీశారు.ప్రతిపక్ష నాయకుడి ఇంటిపైకి అధికార పార్టీ నాయకులు వెళ్లడాన్ని కూడా కవిత తప్పుబట్టారు. ముఖ్యమంత్రి తన పార్టీ నాయకులను ఇలాంటి చర్యలకు ప్రోత్సహించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందని నిలదీశారు.రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అనేక సమస్యలతో ఆందోళన చెందుతున్న సమయంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండు రోజులుగా శాసనసభ సమయాన్ని వృథా చేశాయని



విమర్శించారు.ఇకనైనా శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ నిర్ణయాలు తీసుకోవాలని కవిత కోరారు.

# తాతా మధు వ్యాఖ్యలపై డోర్నకల్‌లో నిరసన

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా, ర్యాలీ..**

**రాజ్యాంగ పదవికి గౌరవం ఇవ్వాలని డిమాండ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, డోర్నకల్, సెప్టెంబర్ 08:**
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం డోర్నకల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు. దళిత సమాజానికి చెందిన వ్యక్తి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయనను ఉద్దేశించి అనుచిత



పదజాలం ఉపయోగించడం సమంజసం కాదని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో పదవులు, వ్యక్తులు వేర్వేరైనా రాజ్యాంగ వ్యవస్థకు ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాల్సిందేనని అన్నారు. రాజకీయంగా విమర్శలు చేసుకోవచ్చుని, అయితే వ్యక్తిగతంగా అవమానించేలా, సామాజిక వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.తాతా మధు వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీల నాయకత్వాలు తమ నేతలకు బాధ్యతాయుతమైన రాజకీయ భాషను పాటించేలా సూచించాలని కోరారు.ధర్నా అనంతరం కాంగ్రెస్ శ్రేణులు డోర్నకల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకత్వ తీరుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి, పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, వైస్ చైర్మన్ మాద లావణ్య శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై చెత్త రాజ్యం..మున్సిపల్ అధికారుల దృష్టి ఎప్పుడు?

**బహిరంగంగా చెత్త, మూత్ర విసర్జనతో ప్రజలకు నరకయాతన**

**దుర్గంధం-దోమల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, దుబాయ్ గేట్, సెప్టెంబర్ 08 (ప్రతినిధి):**
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సికింద్రాబాద్ సర్కిల్-3, ఓల్డ్ బోయినపల్లి 264వ డివిజన్‌లో ప్రధాన రహదారిపై చెత్త నిల్వలు ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి. హస్మత్‌పేట్ నుంచి దుబాయ్ గేట్ మీదుగా మహాత్మానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై కొందరు వాహనాలపై వచ్చి బహిరంగంగా చెత్త వేస్తుండటంతో పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది.చెత్త కుప్పల కారణంగా దుర్గంధం, దోమల బెడద పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో బహిరంగంగా మూత్ర విసర్జన చేయడం వల్ల ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

**అవగాహనతో పాటు కఠిన చర్యలు**

ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. చెత్తను బయట వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, చెత్త సేకరణ వాహనాలను అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.అలాగే సామాజిక మాధ్యమాలు, డివిజన్ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల ద్వారా చెత్త నిర్వహణపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, మూత్ర విసర్జన చేయడం వంటి చర్యలకు జరిమానాలు, ఇతర నిబంధనల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరుతున్నారు.కొత్తగా ఏర్పడిన మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, చెత్త నిల్వలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు కూడా రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు.



# కొత్తూరులో డ్రగ్స్ దందాకు భారీ షాక్..
# రూ.1.42 కోట్ల హాష్ ఆయిల్ పట్టివేత.!

**ఒడిశా నుంచి 11.319 కిలోల హాష్ ఆయిల్ తరలింపు..**

**విక్రయానికి సిద్ధమవుతుండగా నిందితుడి అరెస్ట్.. సరఫరా నెట్‌వర్క్‌పై పోలీసుల నజర్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, కొత్తూరు, సెప్టెంబర్ 08:**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా హాష్ ఆయిల్ పట్టుబడింది. కొత్తూరు పోలీసులు, ప్రత్యేక ఆపరేషన్ బృందం, షాద్‌నగర్ జోన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.1.42 కోట్ల విలువైన 11.319 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఇన్ముల్‌నర్వ-పీ అండ్ జీ కంపెనీ రోడ్ దాటిన తర్వాత అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని హెచ్.ధృవ్ అలియాస్ ధృవ్ జోషి (30)గా గుర్తించారు. అల్వాల్‌కు చెందిన అతడు ప్రస్తుతం ఒడిశాలో నివసిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.అనుమానంతో అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా 11 ప్యాకెట్లలో హాష్ ఆయిల్ లభించినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.1.42 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా



వేశారు. నిందితుడి వద్ద నుంచి ఒక స్మార్ట్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**ఒడిశా నుంచి తీసుకొచ్చి విక్రయానికి..**

విచారణలో నిందితుడు ఒడిశాకు చెందిన రోహిత్ అనే వ్యక్తి వద్ద నుంచి హాష్ ఆయిల్‌ను తీసుకుని కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు కొత్తూరు సీఐ నాగార్జున తెలిపారు. ఈ అక్రమ రవాణా, విక్రయాల ద్వారా కమిషన్ లేదా వాటా ప్రాతిపదికన ఆర్థిక లాభం పొందేందుకు పనిచేస్తున్నట్లు విచారణలో తేలిందని చెప్పారు.హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు నిందితుడు పేర్కొన్న రోహిత్‌తో పాటు ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ ఆపరేషన్ షాద్‌నగర్ జోన్ డీసీపీ సీహెచ్ శిరీష రాఘవేందర్, ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.




# కండలు పెంచడానికి కరెక్ట్ ఆహారం ఇదే!

జిమ్‌లో గంటల తరబడి శ్రమించినంత మాత్రాన సరిపోదు, కండరాల పుష్టికి సమతుల్య పోషకాహారం కూడా అత్యంత కీలకం. దృఢమైన కండరాల నిర్మాణం కోసం ఎటువంటి ఆహార నియమాలు పాటించాలనే అంశంపై అపోలో హాస్పిటల్స్ న్యూట్రిషనిస్టులు డాక్టర్ ప్రియాంక రోహత్గీ, డాక్టర్ అనితా జటానా పలు కీలక సూచనలు చేశారు.ఎన్డీటీవీ కథనం ప్రకారం.. కండరాల పెరుగుదలను ఆశించే వారు తమ రోజువారీ అవసరాల కంటే అదనంగా 300 నుంచి 500 కేలరీల శక్తిని తీసుకోవాలి. అదేవిధంగా, శరీర బరువులో ప్రతి కిలోగ్రాముకు 1.6 నుంచి 2.2 గ్రాముల చొప్పున ప్రోటీన్ అందేలా చూసుకోవాలి. ఈ ప్రోటీన్‌ను రోజుకు 4 నుంచి 5 దఫాలుగా విభజించి తీసుకోవడం వల్ల కండరాల అభివృద్ధికి మెరుగైన ప్రయోజనం చేకూరుతుంది.వ్యాయామం చేసే క్రమంలో చాలామంది పిండిపదార్థాలను పూర్తిగా పక్కన పెడుతుంటారు. అయితే, వర్కౌట్ చేయడానికి కావాల్సిన శక్తిని అందించడంలోనూ, కండరాల క్షీణతను అరికట్టడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. వర్కౌట్‌కు గంట ముందు అరటిపండు వంటి తేలికపాటి ఆహారం, వ్యాయమం పూర్తయిన అరగంటలోపు ప్రోటీన్ షేక్ తీసుకోవడం వల్ల ఆశించిన ఫలితాలు లభిస్తాయి.దైనందిన ఆహారంలో గుడ్లు, చికెన్ బ్రెస్ట్, చేపలు, పనీర్, సోయా, గ్రీక్ యోగర్ట్ వంటి అధిక ప్రోటీన్ కలిగిన పదార్థాలను చేర్చుకోవాలి. వీటితో పాటు ఓట్స్, బ్రౌన్ రైస్, చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. కండరాల రికవరీకి రోజుకు కనీసం 3.5 నుంచి 4 లీటర్ల నీరు తాగడంతో పాటు, రాత్రివేళ 7-8 గంటలు గాఢ నిద్ర అత్యంత అవసరం.అయితే, ఇవి కేవలం సాధారణ సూచనలు మాత్రమేనని, ప్రతి ఒక్కరి శరీర తత్వం వేర్వేరుగా ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కావున, వ్యక్తిగత శరీర స్వభావాన్ని బట్టి తగిన డైట్ ప్లాన్ కోసం తప్పనిసరిగా వైద్యులను లేదా పోషకాహార నిపుణులను సంప్రదించడం శ్రేయస్కరం.



# హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతి: భారత్‌లో తొలిసారిగా గ్లోబల్ రియల్ ఎస్టేట్ సదస్సు

ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఏడవ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ (×=జుజ)కు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. దేశంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరగడం ఇదే ప్రథమం. 2026 సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు హైటెక్స్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ గ్లోబల్ ఈవెంట్‌కు 35కు పైగా దేశాల నుంచి 1500 మందికి పైగా ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలు, నిపుణులు హాజరుకానున్నారు.“ది డోర్ టు వాట్ హ్యాపెన్స్ నెక్స్ట్” (భవిష్యత్తుకు తలుపులు) అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో రాబోయే మార్పులు, మారుతున్న ఆర్థిక ప్రాధాన్యతలు, అంతర్జాతీయ పెట్టుబడులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), ప్రాప్‌టెక్, డీప్‌టెక్, సుస్థిర అభివృద్ధి వంటి కీలక అంశాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమం మూడు ప్రధాన విభాగాల కలయికగా జరగనుంది. ఇందులో అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్‌తో పాటు, ప్రాప్‌టెక్ అండ్ రియల్ ఎస్టేట్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో కూడా ఉంటాయి.ఈ సందర్భంగా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్-ఇండియా (నార్-ఇండియా) ఛైర్మన్ సుమంత్ రెడ్డి ఆరాణి మాట్లాడుతూ, “భారతదేశ డెవలపర్లు, నిపుణులు, ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసే స్థాయికి చేరుకున్నాయి” అని అన్నారు. ఈ సదస్సు ఆ స్థాయిని ప్రపంచానికి చాటి చెబుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.×=జుజ 2026 ఛైర్ శైలేందర్ సింగ్ మాట్లాడుతూ, “ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగంలో రానున్న మార్పులతో భారతదేశాన్ని అనుసంధానించే ఒక వేదికను సృష్టించాలన్నదే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం” అని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుతో హైదరాబాద్ కీర్తి మరింత పెరగడంతో పాటు, భారత రియల్ ఎస్టేట్ రంగంలోకి కొత్త పెట్టుబడులకు మార్గం సుగమం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.